సాక్షి
అన్నమయ్య జిల్లా

మంగళవారం । 5 । నవంబర్ । 2024



మదనపల్లెలో హీరో కిరణ్ అబ్బవరం

'క' సినిమా విజయోత్సవాల్లో భాగంగా సినిమా హీరో కిరణ్ అబ్బవరం సోమవారం రాత్రి మదనపల్లెలో చిత్ర బృందంతో కలసి సందడి చేశారు. - 8లో



సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయాలి

కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.290	రూ.340
రెండోరకం	రూ.200	రూ.268



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 307 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్ఠం	గరిష్ఠం
బైవోల్టిన్	515	515
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 58.980 కిలోలు

న్యూస్‌రీల్

నేడు జిల్లా వాలీబాల్ జట్ల ఎంపిక

మదనపల్లె సిటీ : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్‌-14 బాల,బాలికల వాలీబాల్ జట్ల ఎంపిక జరుగుతుందని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వసంత తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే జట్ల ఎంపికకు క్రీడాకారులు హాజరు కావాలని ఆమె కోరారు.

గడువు పొడిగింపు

రాయచోటి (జగదాంబసెంటర్) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖల పరిధిలో అర్హులైన నిరుపేద ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఉచిత డీఎస్సీ శిక్షణకు నమోదు చేసుకోవాల్సిన గడువును ఈ నెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ, సాధికారతాధికారి ఎస్.జయ ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు httpr//jnana bhumi.ap.gov.in/ వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకున్న అభ్యర్థులకు స్క్రీనింగ్ టెస్ట్ ఆన్‌లైన్‌లో మాత్రమే నిర్వహించనున్నామని తెలిపారు. మరిన్ని వివరాలకు 94402 56697 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

నిత్యాన్నదానానికి రూ.1,00,166 వితరణ



ఆలయ ఈఓ డీవీ రమణ రెడ్డికి డబ్బును అందజేస్తున్న భక్తులు

రాయచోటి టౌన్ : శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో నిర్వహించే అన్నప్రసాద వితరణ కోసం తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లాకు చెందిన బసవలింగం ఆయన భార్య శ్రీలత రూ.1,00,116లు వితరణగా అందజేశారు. సోమవారం వారు ఆలయానికి వచ్చి ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డికి అందజేశారు. అనంతరం ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి ఆలయ ప్రధాన అర్చకులతో ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేసి ఘనంగా సన్మానించారు.

ఆర్టీసీలో అప్రెంటిస్‌కు దరఖాస్తు చేసుకోండి

రాయచోటి అర్బన్ : ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈనెల 19వ తేదీలోపు ఏపీఎస్‌ఆర్‌టీసీలో అప్రెంటీస్‌గా చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఆ సంస్థ కర్నూలు జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాల ప్రిన్సిపల్ నజీర్‌అహమ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. డీజిల్, మోటర్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, మిషనిస్టు, ఫిట్టర్ సివిల్ విభాగాలలో ఖాళీలు ఉన్నాయన్నారు. వీటిలో కర్నూలు జిల్లాలో 47, నంద్యాల జిల్లాలో 45, అనంతపురం జిల్లాలో 53, సత్యసాయి జిల్లాలో 37,కడప జిల్లాలో 65, అన్నమయ్య జిల్లాలో 48 ఖాళీలు ఉన్నాయన్నారు. ఆయా జిల్లాలలో ఐటీఐల నుండి ఉత్తీర్ణులైన వారు మాత్రమే అర్హులన్నారు. అప్రెంటీస్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వెరిఫికేషన్ కోసం కర్నూలులోని ఏపీఎస్ ఆర్‌టీసీ జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాలకు రావాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఒక సెట్ జిరాక్స్ కాపీలు తీసుకురావాలన్నారు. వెరిఫికేషన్ రుసుం కింద రూ. 118 చెల్లించాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు WWW.apprenticerhipindia.govt.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రజా ఫిర్యాదులకు ప్రథమ ప్రాధాన్యత

– జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



ప్రజల సమస్య వింటున్న ఎస్పీ విద్యాసాగర్

రాయచోటి : ప్రజల సమస్యలను స్పష్టంగా తెలుసుకొని, చట్టపరిధిలో విచారించి తగిన న్యాయం చేయడానికి జిల్లా పోలీస్ శాఖ సిద్ధంగా ఉంటుందని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఫిర్యాదుదారులకు భరోసా ఇచ్చారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ఎస్పీ జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలతో నేరుగా ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలపై చర్చించారు. కొన్ని సమస్యల పట్ల స్పందించి సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. సబ్ డివిజన్, సర్కిల్, పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యత ఇచ్చి సమగ్ర విచారణ ద్వారా సమస్యలను పరిష్కరించాలని ఎస్పీ తెలిపారు.

భగ్నమైన భగీరథయత్నం

- రూ.1,825 కోట్లతో చేపట్టిన వాటర్‌గ్రిడ్‌ను రద్దు చేసిన ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కాంట్రాక్టు సంస్థతో ఒప్పందం, సమగ్ర సర్వే పూర్తి
- ఇదికాదని కొత్తగా మళ్లీ టెండర్ల నిర్వహణకు కసరత్తు
- పథకం నుంచి మదనపల్లె, పుంగనూరు నియోజకవర్గాలు ఔట్
- పీలేరు, తంబళ్లపల్లె, రాయచోటికి మాత్రమే వర్తించేలా కొత్త ప్రణాళిక
- అంచనాలు పెంచుకుని రూ.2,370 కోట్లతో ఈనెలాఖరులోగా టెండర్లు
- ఫేజ్‌-1, ఫేజ్‌-2 పేరుతో మళ్లీ మొదటికి
- పనులు చేపట్టేందుకు ఇంకెంత కాలం పడుతుందో?



గుర్రంకొండ మండలం మామిళ్లవారిపల్లె వద్ద కృష్ణా జలాల శుద్ధికి రీట్రీట్ ప్లాంట్ నిర్మించే ప్రాంతం

మార్పుతో ప్రయోజనం పొందేవి

రాయచోటి నియోజకవర్గం: గాలివీడు, రామాపురం, ఎల్‌ఆర్‌పల్లె, రాయచోటి, సంబేపల్లె, చిన్నమండెం
తంబళ్లపల్లె నియోజకవర్గం: బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు, కురబలకోట, తంబళ్లపల్లె, పెద్దమండ్యం
పీలేరు నియోజకవర్గం: పీలేరు, వాల్మీకిపురం, గుర్రంకొండ, కేవీపల్లె, కలికిరి, కలకడ

నష్టపోయే ప్రజలు

మదనపల్లె నియోజకవర్గం: మదనపల్లె రూరల్, నిమ్మనపల్లె, రామసముద్రం.
పుంగనూరు నియోజకవర్గం: సోమల, చౌడేపల్లె, సదుం, పుంగనూరు రూరల్, పులిచర్ల, రొంపిచర్ల
మున్సిపాలిటీలు: మదనపల్లె, పుంగనూరు

వాటర్‌గ్రిడ్ అసలు స్వరూపం

లబ్ధి కలిగే మండలాలు : 27
పల్లెలు : 5,336
జనాభా : 13,94,757 మంది
2054నాటికి : 15.16 లక్షల మందికి
మున్సిపాలిటీలు : మదనపల్లె, బి.కొత్తకోట, పుంగనూరు, రాయచోటి
ప్రధాన పైప్‌లైన్ : 514 కి.మీ
నీటిని అందించే పైప్‌లైన్ : 2,981 కి.మీ
రక్షిత ట్యాంకుల విలువ : రూ.454 కోట్లు
ప్రధాన పైప్‌లైన్ విలువ : రూ.1,000 కోట్లు
మొత్తం పనుల వ్యయం : రూ.1,825.68 కోట్లు
(ఇందులో మార్పులు జరుగుతున్నాయి)

బి.కొత్తకోట: శాశ్వత తాగునీటి వసతి లేక, ఫ్లోరైడ్ నీటితో అష్టకష్టాలు పడుతున్న అన్నమయ్య జిల్లా ప్రజలకు వైఎస్సార్ జిల్లా గండికోట రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను తరలించి శుద్ధి చేసిన రక్షిత మంచినీటిని అందించాలన్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేసిన భగీరథ యత్నానికి టీడీపీ కూటమి ప్రభుత్వం భగ్నం చేస్తోంది. ఇప్పటికే టెండర్లు పూర్తయి, కాంట్రాక్టు సంస్థతో ఒప్పందం జరిగింది. సంస్థ నీటిని అందించే పనులకు సమగ్ర సర్వే కూడా పూర్తి చేసింది. సరిగ్గా పనులు చేపట్టే సమయానికి ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో పరిస్థితులు మారిపోయాయి. గత ప్రభుత్వం చేపట్టిన వాటర్‌గ్రిడ్ పథకాన్ని భగ్నం చేస్తూ నిర్ణయాలు తీసుకుంది. తాజాగా ఫేజ్‌-1, ఫేజ్‌-2 పేరుతో ప్రజలకు కలగాల్సిన ప్రయోజనాలను కుదిస్తోంది. రెండు దశలకు అంచనాలు పెంచుకుని మళ్లీ టెండర్లను నిర్వహించి తమకు అనుకూలమైన కాంట్రాక్టు సంస్థలకు పనులు అప్పగించేందుకు ప్రయత్నిస్తోంది. దీనితో పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్న కాంట్రాక్టు సంస్థ వెనక్కు వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇదీ వాటర్ గ్రిడ్ ప్రణాళిక

తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, రాయచోటి, పుంగనూరు నియోజకవర్గాలకు కృష్ణా జలాలు తరలించి ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని గత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారు. రూ.2,400 కోట్లు మంజూరు చేయగా 2023 సెప్టెంబర్‌లో జరిగిన రివర్స్ టెండరింగ్‌లో రూ.1,825.68 కోట్లకు టెండర్ దాఖలై ప్రభుత్వానికి రూ.76.08 కోట్లు ఆదా అయ్యింది. ఒప్పందం ప్రకారం వైఎస్సార్ జిల్లాలోని గండికోట రిజర్వాయర్ నుంచి రాయచోటి, తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె, పుంగనూరు నియోజకవర్గాలు, మదనపల్లె, పుంగనూరు మున్సిపాలిటీలు, బి.కొత్తకోట నగర పంచాయతీ ప్రజలు, పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్, కలికిరి సైనిక్ స్కూల్‌కు తాగునీటిని అందించే పనులు చేపట్టాలి. దీనికోసం కాంట్రాక్టు సంస్థ సమగ్ర సర్వే పూర్తి చేసింది. ప్రస్తుతం 13,94,757 మంది జనాభాకు, 2054 నాటికి 15.16 లక్షల మందికి తాగునీటిని అందించే పనులను చేపడతారు. 27 మండలాల్లోని 5,336 పల్లెలు, మున్సిపాలిటీల్లోని ప్రజలను వాటర్‌గ్రిడ్ పరిధిలోకి తీసుకొచ్చారు.

రూ.2,370 కోట్లతో మళ్లీ టెండర్లు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.1,825 కోట్లతో చేపట్టిన వాటర్‌గ్రిడ్‌ను టీడీపీ కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. కరువు ప్రజల విశాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని గత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పథకానికి మళ్లీ టెండర్లు నిర్వహించి కాలయాపన చేయడమేకాక ప్రయోజనాలను దెబ్బ తీసేలా వ్యవహరిస్తోంది. మదనపల్లె, చిత్తూరుజిల్లా పుంగనూరు నియోజకవర్గాలను గ్రిడ్ నుంచి తొలగించి ఈ ప్రాంత ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నారు. కొత్తగా మళ్లీ డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్‌ను సిద్ధం చేశారు. ఇందులో తంబళ్లపల్లె, పీలేరు, రాయచోటి నియోజకవర్గాలకు మాత్రమే నీటిని అందించేలా అంచనాలు పెంచుకుని రూ.2,370 కోట్లతో ఈనెలాఖరులోగా టెండర్లు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ టెండర్లు నిర్వహించి పనులు పూర్తయ్యేది ఎప్పటికి అన్న ప్రశ్న తలెత్తుతోంది.

ఫేజ్‌-2 ఎప్పుడు?

మొదటి విడత పనులు ఎప్పుడు పూర్తవుతాయే తెలియదుకాని పథకాన్ని చిత్తూరుజిల్లాలోని పలమనేరు, కుప్పంలకు విస్తరించాలని నిర్ణయించారు. టెండర్లు పిలిచే కొత్త పథకంలో పుంగనూరు, మదనపల్లెను తొలగించారని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు తెలిపారు. మొదటి విడతలో పీలేరు, తంబళ్లపల్లె, రాయచోటి పనులకు టెండర్లు పూర్తి చేసి రెండో విడతలో మదనపల్లె, పుంగనూరు, పలమనేరు, కుప్పం పనులకు అయ్యే అంచనా వ్యయాన్ని నిర్ణయించి టెండర్లు నిర్వహిస్తారని చెబుతున్నారు. అయితే ఇది కార్యరూపం దాల్చడం సాధ్యమా అని ప్రశ్నిస్తున్నారు. రెండు దశల పేరుతో వందల కోట్లకు అంచనాలు పెంచుకోవడం మినహా సత్వరమే కలిగే ప్రయోజనం ఏమిటన్న వాదన వినిపిస్తోంది. గత ప్రభుత్వ ఒప్పందాన్ని యథాతథంగా అమలు చేసి ఉంటే నిధుల భారం తప్పడమేకాక ఐదు నియోజకవర్గాలకు తాగునీటి సమస్య తీరేది. పథకం విస్తరించాలనుకున్న పలమనేరు, కుప్పం పనులకు టెండర్లు నిర్వహించుకుని ఉంటే వందల కోట్లు ఆదా కావడమేకాక సమయం వృథా అయ్యేదికాదు. ఈ కొత్త ప్రణాళికలతో పనులు కార్యరూపం దాల్చడానికి ఇంకెన్నేళ్లు పడుతుంది, ప్రజల దాహార్తి తీర్చేది ఎప్పటికో.

ఇది భగీరథ ప్రయత్నం

సముద్రమట్టానికి 200 మీటర్ల ఎత్తులోని వైఎస్సార్‌జిల్లా గండి జలాశయం నుంచి 664 మీటర్ల ఎత్తులోని అన్నమయ్యజిల్లా గుర్రంకొండ మండలంలోని మామిళ్లవారిపల్లె రీట్రీట్ ప్లాంటుకు 3.37 టీఎంసీల కృష్ణా జలాలను ఎత్తిపోసే భగీరథ ప్రయత్నమిది. ఈ ప్రయత్నం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసి పనులు మొదలుపెట్టే వరకు ముందుకు వెళ్లింది. ఇంతటి ఎత్తు నుంచి నీటిని తరలించుకోవాలన్న ప్రయత్న విషయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంకల్పంతో పనిచేసింది. గండికోట రిజర్వాయర్ నుంచి పైప్‌లైన్, నీటి శుద్ధి ప్లాంట్ల ఏర్పాటు, నీటి సరఫరా కోసం 3,500 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణం చేస్తారు. ట్యాంకుల నుంచి నీటిని సరఫరా చేసేందుకు అదనంగా రూ.454.57కోట్లతో 300కుపైన నీటి ట్యాంకులను నిర్మించాలని నిర్ణయించారు.

- గండికోట రిజర్వాయర్ నుంచి గాలివీడుకు 14.10 కిలోమీటర్ల పంపింగ్ పైప్‌లైన్, గండికోట నుంచి గాలివీడుకు గ్రావిటీ ద్వారా 122.40 కిలోమీటర్లు, గాలివీడు నుంచి గుర్రంకొండకు 28 కిలోమీటర్ల పైప్‌లైన్ పనులు చేపడతారు. గాలివీడు మీదుగా గుర్రంకొండ, కేవీపల్లె మండలంలోని అడవిపల్లెకు తరలిస్తారు. రిజర్వాయర్‌లో ఇన్‌టెక్ వెల్ నిర్మాణంతో శుద్ధి చేయని నీటిని (రా వాటర్) గుర్రంకొండ పరిసరాల్లో ఒకటి, కేవీపల్లె మండలం అడవిపల్లె పరిసరాల్లో ఒకటి ట్రీట్‌మెంట్ ప్లాంట్లను నిర్మిస్తారు. మధ్యలో ఆరు చోట్ల ఎత్తిపోతల పథకాలను నిర్మిస్తారు.

ఆలయాల్లో కార్తీక శోభ



రాజంపేట పట్టణంలోని శివాలయంలో భక్తుల రద్దీ (ఇన్‌సెట్) నిత్యపూజకోనలో దర్శనమిస్తున్న శివుడు

రాయచోటి : కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఉన్న శైవక్షేత్రాలతో పాటు అన్ని ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. అయా ప్రాంతాలలో ఉన్న ఆలయాల్లో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక మాసంలో భాగంగా మొదటి సోమవారం రోజున నదులు, కోనేరులు, నీటి ప్రవాహాలలో భక్తులు కార్తీక దీపాలు విడిచిపెట్టి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే శివాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. మహదేవుని దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఇక స్వామి వారికి అభిషేకాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

జిల్లా కేంద్రమైన రాయచోటిలోని శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం, పాత రాయచోటిలోని శ్రీ అగస్తేశ్వర స్వామి ఆలయం, ఎస్ఎన్ కాలనీలోని శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయం, రాజంపేట నియోజకవర్గ పరిధిలోని అత్తిరాలలో ఉన్న శ్రీ కామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి ఆలయం, గుండ్లూరులోని అగస్తేశ్వర స్వామి ఆలయం, తంబళ్లపల్లె నియోజకవర్గం మల్లయ్య కొండపై వెలసిన భ్రమరాంబికా సమేత మల్లిఖార్జునస్వామి ఆలయం, అంగళ్ల మల్లయ్య కొండ ఆలయంలో విశేష పూజలు చేశారు. అలాగే మదనపల్లి నియోజకవర్గంలోని తవళం నేల మల్లేశ్వరి స్వామి ఆలయం, పట్టణంలోని మణికయ్యల శివాలయం, కోడూరు పరిధిలోని భ్రమరాంబిక మల్లేశ్వర స్వామి ఆలయం, గుండాలకోన శివాలయం, పీలేరులోని శ్రీ కాశీ విశ్వేశ్వరాలయం లాంటి ప్రధాన ఆలయాలతో పాటు మండల గ్రామీణ ప్రాంతాలలో వెలసిన శివాలయాలలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి : ప్రాధాన్యత క్రమంలో ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవచూపాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తోపాటు జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌ఓ కె. మధుసూదన్ రావు, ఎస్‌డీసీ రామసుబ్బయ్యలు ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను ఎప్పటికప్పుడు వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. సమస్య వచ్చిన మరుసటిరోజు క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ చేయాలన్నారు. ప్రజలు ఇచ్చిన వినతులను ఆలస్యం చేయకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకొని పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తుల గురించి మండల తహశీల్దార్లతో సమీక్షించారు. ఆయా మండలాల తహశీల్దార్లు, డివిజన్ స్థాయిలో ఆర్డీఓలు ప్రాధాన్యతగా పరిష్కరించాలన్నారు. జిల్లా అధికారులు కూడా వారిశాఖలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలను పక్కాగా నిర్వహించాలి

జిల్లాలోని ఆరు సాగునీటి సంఘాలకు ఎన్నికలను ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో ఈనెల 21న నిర్వహించబోయే సాగునీటి సంఘాల ఎన్నికలపై ఆర్డీఓలు, తహశీల్దార్లు, నీటిపారుదలశాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. నీటిపారుదలశాఖ ఈఈ భరత్ కుమార్ సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 10వ తేదీకల్లా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూసుకోవాలని ఆర్డీఓలు, తహశీల్దార్లను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనబోయే అధికారులు, సిబ్బందికి అవసరమైన శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని నీటిపారుదలశాఖ ఈఈని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌ఓ మధుసూదన్ రావు, ఎస్‌డీసీ రామసుబ్బయ్య, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ నరసింహ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అపార్ ఐడీ కోసం ప్రత్యేక సేవలు

విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా అన్నమయ్య జిల్లాలో ఒక యజ్ఞంలా అపార్ యూనిక్ ఐడీ క్రియేట్ చేయడానికి కృషి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ హాలు నుంచి ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఎంఈఓలు, వీఆర్‌ఓలు, పంచాయతీ సెక్రటరీలు, మున్సిపల్ కమిషనర్లు, మండల స్పెషల్ అధికారులతో జూమ్ వీసీ ద్వారా 'అపార్ యూనిక్ ఐడీ' ప్రగతిపై సమీక్షించారు. ఇప్పటి వరకు జిల్లాలో ఎంత శాతం మేర పిల్లలకు అపార్ యూనిక్ ఐడీ జారీ చేశారు. యూనిక్ ఐడీ జారీలో ఏర్పడుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు.

మోదం.. ఖేదం

- కొన్ని మండలాలను మాత్రమే కరువు కింద ప్రకటించిన ప్రభుత్వం
- జిల్లా వ్యాప్తంగా కేవలం 40 వేల ఎకరాల్లోనే పంటలు
- ఎన్ని తుఫాన్లు వచ్చినా వర్షాలు పడక అల్లాడిన అన్నదాతలు
- ఖరీఫ్ లో సాగుచేసిన పంటలు ఎండిపోయిన వైనం
- జిల్లాలో 11 మండలాలకు మొండి చేయి
- సాయం అందించడంలో ఇప్పటికీ సర్కారు మీనమేషాలు



సాక్షి రాయచోటి : ఖరీఫ్ సాగు రైతులను తీవ్ర నష్టాలలో ముంచెత్తింది. పదును వర్షంలేక విత్తనం వేయలేక కొంతమంది రైతులు తల్లడిల్లిపోతే.. పంట విత్తిన తర్వాత వానలు కురవక పంటలు ఎండిపోయి మరి కొందరు రైతులు నష్టపోయారు. ఎన్నో ఆశలతో ఖరీఫ్ వ్యవసాయం చేసిన రైతుల నెత్తిపై వర్షాభావ ప్రభావంతో కరువు కొంపముంచింది. ప్రస్తుతం రబీ సీజన్ ప్రారంభమైనా ఆదుకోవాల్సిన కూటమి సర్కార్ ఇంకా మీనమేషాలు లెక్కిస్తుండడం ఆందోళన కలిగించే పరిణామం.

కరువు మండలాల ఎంపికలో మోదం-ఖేదం

అన్నమయ్య జిల్లాలో వర్షాభావంతో అన్నదాతకు ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. ఖరీఫ్‌లో మొత్తం పంటలు కోల్పోయిన అన్నదాతలకు సంబంధించి ప్రభుత్వం కరువు మండలాల ఎంపికలో పారదర్శకత లేకపోవడం ఆందోళన కలిగించే పరిణామం. జిల్లాలో వర్షపాతం, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకుని 30 మండలాలు ఉండగా 19 మండలాలను కరువు ప్రభావిత మండలాలుగా ఎంపిక చేశారు. మిగిలిన 11 మండలాల్లో కూడా పంటలు సాగు చేసి చాలావరకు నష్టపోయినా కరువు మండలాల జాబితాలో లేకపోవడంతో అక్కడి రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈ 11 మండలాల్లో కూడా చాలామండలాల్లో వ్యవసాయ ఆధారితంగా పంటలు సాగు చేసుకుని జీవించే రైతులు వేలల్లో ఉన్నారు. ఇటువంటి తరుణంలో ప్రభుత్వం కరువు మండలాల ఎంపిక విషయంలో కొన్ని మండలాల పట్ల మోదం...మరికొన్ని మండలాల పట్ల ఖేదం ఎందుకు చూపిందన్నది అర్థం కావడం లేదు.

సర్కార్ సాయం ఎప్పుడు?

ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఎప్పుడు ఆదుకుంటుందో అర్థం కావడం లేదు. ఎందుకంటే ఇప్పటికే పంటలపై పెట్టుబడులు పెట్టి చివరకు వర్షాభావంతో దిగుబడులు లేక...పెట్టుబడులు రాక అల్లాడిపోతున్నారు. ఇలాంటి తరుణంలో కూటమి సర్కార్ వెంటనే ఆదుకునే దిశగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. గతంలో వైఎస్సార్ సీపీ సర్కార్ హయాంలో ఖరీఫ్ సీజన్ ముగియగానే ఎప్పటికప్పుడు ఆ సీజన్‌కు సంబంధించి రెండవ సీజన్ ప్రారంభం కాగానే రైతు భరోసా కింద పెట్టుబడి సాయంతోపాటు ఇన్‌పుట్ సబ్సిడీ వెంటనే అందించే పరిస్థితి ఉండేది. ఉచిత పంటల బీమా పథకం ద్వారా ప్రతి ఏడాది క్రమం తప్పకుండా అర్హులైన రైతులందరికీ అందించడం జరిగేది. కానీ ఇప్పటికూటమి సర్కార్ ఇంకా పరిహారం గానీ, ఇన్‌పుట్ సబ్సిడీపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

జిల్లాలో ఖరీఫ్ సాగు వివరాలు (హెక్టార్లలో)

జిల్లాలో సాధారణ సాగు లక్ష్యం	65,386
ఖరీఫ్‌లో సాగైన పంటల విస్తీర్ణం	30,000
ప్రధానంగా వేరుశనగ సాగు	16,000

ఖరీఫ్‌లో ప్రధానంగా అదునుకు పడిన వర్షపాతం వివరాలు

నెల	సాధారణం	కురిసింది
మే	43	78.5
జూన్	75.1	160.6
జులై	90.5	47.5

సమీక్షా సమావేశంలోనూ కరువు ప్రస్తావన

జిల్లాలో రెండు రోజుల కిందట జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలోనూ వైఎస్సార్ సీపీ ఎంపీ, రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డిలు కరువు మండలాల విషయంగా మాట్లాడారు. జిల్లాలో 19 మండలాలే కాకుండా మిగిలిన మండలాలను కూడా కరువు మండలాల జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. వీరితోపాటు టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రజాప్రతినిధులు కలెక్టర్ శ్రీధర్ సమక్షంలో కరువు మండలాల అంశంపై చర్చించిన అనంతరం మరొకమారు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు సిద్ధమవుతున్నారు. ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ముగ్గురికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాధితులు

కురబలకోట : మండలంలోని వేర్వేరు చోట్ల సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ముదివేడు పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బి.కొత్తకోటకు చెందిన శంకర్ (40) మండలంలోని అంగళ్లుకు వెళ్లి తిరిగి మోటార్ సైకిల్‌పై స్వగ్రామం వస్తుండగా.. చెన్నామర్రి మిట్ట వద్ద ఎదురుగా వచ్చిన పుంగనూరు జగన్ కాలనీకి చెందిన మునిస్వామి అలియాస్ దేవా (35) బండి పరస్పరం ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. అదే విధంగా ములకలచెరువు మండలం వడ్డిపల్లెకు చెందిన ఈశ్వరయ్య (50) బైకులో మదనపల్లె వెళ్లాడు. తిరిగి స్వగ్రామం వెళుతుండగా మార్గంమధ్యలోని కంటేవారిపల్లె వద్ద ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. 108 సిబ్బంది మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేశారు. ఈ సంఘటనలపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతి

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో నలుగురు మృత్యువాత పడ్డారు. కలికిరి మండలం మర్రికుంటపల్లి, రాయచోటిలో కార్లు ఢీకొని ఇద్దరు మృతి చెందారు. నిమ్మనపల్లె మండలంలో ఓ వ్యక్తి చేపలు పట్టేందుకు వెళ్లి చెరువులో పడి విగత జీవిగా మారాడు. పీలేరు పట్టణం సైనిక్ నగర్‌లో ఇంటి పైనుంచి పడి ఓ కూలీ తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. ఈ ఘటనల్లోని బాధిత కుటుంబాల సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

కలికిరి : కలికిరి మండల పరిధిలో సోమవారం ఉదయం కారు ఢీకొని ఓ వ్యక్తి మరణించాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వాల్మీకిపురం మండలం మేకలవారిపల్లికి చెందిన కోళ్ళ రెడ్డెప్ప(47) ఆవుల వ్యాపారం చేస్తూ జీవించేవాడు. ఆయన ఇంటి నుంచి బయల్దేరి కలికిరి మీదుగా మహల్ వైపు వెళుతున్నాడు. సుండుపల్లి మండలం తిమ్మసముద్రానికి చెందిన రవీంద్రనాయుడు తన కారులో కేవీపల్లి మండలం తిమ్మాపురం వచ్చి బెంగళూరుకు బయల్దేరాడు. కలికిరి మండలం మర్రికుంటపల్లి గ్రామ పరిధి కొత్తగజ్జలవారిపల్లి వద్ద.. ఎదురుగా వచ్చిన రెడ్డెప్ప ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రెడ్డెప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కలికిరి ప్రభుత్వాసుప్రతికి తరలించారు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు హెచ్‌సీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.



మృతి చెందిన రెడ్డెప్ప

బస్సు కోసం వేచి ఉండగా..

రాయచోటి టౌన్ : రాయచోటిలో ఆదివారం కారు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి మండలం శిబ్యాల గ్రామ పంచాయతీ గొల్లవాండపల్లెకు చెందిన జబ్బు రామాంజులు(45) సుండుపల్లె రోడ్డులోని ఏపీ మోడల్ సమీపాన గల జగనన్న కాలనీలో కూలి పని చేసి ఇంటికి వెళ్లేందుకు బస్సు కోసం వేచి ఉన్నాడు. సుండుపల్లె వైపు నుంచి రాయచోటి వైపు వస్తున్న కారు అతన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి అంబులెన్స్‌లో రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం కడపలోని రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి ప్రమాద సంఘటన స్థలాన్ని పరిశీలించి, విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బొలెరో బోల్తా.. పలువురికి గాయాలు

ములకలచెరువు : బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తా కొట్టడంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం సాయంత్రం మండలంలో చోటుచేసుకుంది. 108 సిబ్బందికి తెలిపిన మేరకు.. శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లికి చెందిన పలువురు బొలెరో వాహనంలో ఆదివారం తమిళనాడు రాష్ట్రం అరుణాచలం వెళ్లారు. సోమవారం దర్శనం ముగించుకుని తిరిగి ఇంటికి వెళుతుండగా ములకలచెరువు సమీపంలోని బైపాస్‌లో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎల్లమ్మ (45), గాయత్రి (26), ఈశ్వరమ్మ (38), యల్లప్ప (48), తరుణ్ (18), అనిల్ (30), శ్రావణి (19), రజిత (20)లకు తీవ్ర గాయాలయ్యాయి. ములకలచెరువు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు.



ప్రమాదంలో దెబ్బతిన్న బొలెరో వాహనం

• చేపలు పట్టేందుకు వెళ్లి..

నిమ్మనపల్లె : చేపలు పట్టేందుకు వెళ్లి ఓ వ్యక్తి మృత్యువాత పడిన సంఘటన సోమవారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. రాచవేటివారిపల్లె పంచాయతీ దిగువ మాచిరెడ్డిగారిపల్లెకు చెందిన బోయకొండయ్య, వెంకటమ్మ దంపతుల కుమారుడు టీ చిన్న రాముడు (48) కూలీ పనులు చేస్తూ జీవించే వాడు. అతనికి భార్య జయమ్మ, ఓ కుమార్తె, ఓ కుమారుడు ఉన్నారు. పిల్లలిద్దరికీ ఇది వరకే వివాహం జరిపించాడు. ఆదివారం సాయంత్రం ఎగువమాచిరెడ్డిగారిపల్లె సమీపంలో ఉన్న చెరువులో చేపలు పట్టుకుని తిరిగి వస్తానని ఇంటి నుంచి చిన్న రాముడు వెళ్లాడు. అయితే రాత్రి అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించారు. అయినా ఫలితం దక్కలేదు. దీంతో తిరిగి సోమవారం ఉదయం ఎగువ మాచిరెడ్డిగారిపల్లె వద్ద చెరువులో వెతకగా మృతదేహం లభించింది. మృతి చెందిన సమాచారాన్ని నిమ్మనపల్లె పోలీసులకు తెలియజేయగా వారు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చేపలు పట్టే సమయంలో చేపల వల కాలికి చిక్కుకొని నీటిలో ప్రమాదవశాత్తు మునిగిపోయి ఉంటాడని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. మృతుడి భార్య డి.జయమ్మ ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ జిల్లాని బాషా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిప్పేస్వామి తెలిపారు.



చిన్న రాముడు మృతదేహం

• ఇంటిపై నుంచి పడి..

పీలేరు రూరల్ : నిర్మాణంలో ఉన్న ఇంటిపై నుంచి పడి కూలీ మృతి చెందిన సంఘటన పీలేరు పట్టణం సైనిక్ నగర్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా వున్నాయి. పట్టణంలోని మోడల్ కాలనీకి చెందిన పి.ఇబ్రహీం (40) కొన్నేళ్లుగా ఇళ్ల నిర్మాణాలకు కూలీ పనులకు వెళ్లి జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం సైనిక్ నగర్‌లో ఓ ఇంటి నిర్మాణ పనికి వెళ్లాడు. మేస్త్రీకి సిమెంట్ అందించే క్రమంలో మూడో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. గమనించిన మేస్త్రీలు, ఇంటి యజమాని హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.



మృతి చెందిన ఇబ్రహీం

అక్రమ మద్యం విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్

రామసముద్రం : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. కర్ణాటక మద్యం విక్రయిస్తున్న మినికి గ్రామానికి చెందిన గిరిబాబు, ఆంధ్రా మద్యం విక్రయిస్తున్న వనగానిపల్లికి చెందిన రామకృష్ణారెడ్డిలను అరెస్ట్ చేశారు. వారు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశారు. ఈ దాడిలో వారి వద్ద నుంచి కర్ణాటక, ఆంధ్రా మద్యం రూ.13,980ల విలువ చేసే 24.6 లీటర్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ధర్నా

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లోని అకడమిక్ బ్లాక్ వద్ద సోమవారం విద్యార్థులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆర్‌కే వ్యాలీ క్యాంపస్‌లో విద్యార్థులు బయటకు వెళ్లకుండా మూడు క్యాంటీన్లు ఏర్పాటు చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఉన్న క్యాంటీన్లను మూసివేయించి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు.

గతంలో ఉన్న క్యాంటీన్లను ఖాళీ చేయాలని ట్రిపుల్ ఐటీ యాజమాన్యంపై టీడీపీ నాయకులు ఒత్తిడి తీసుకురావడంతో వారు క్యాంటీన్లను మూసివేశారన్నారు. ఇప్పటి వరకు కొత్త క్యాంటీన్లకు టెండర్లను పిలవకపోగా హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థకు అప్పగించారని, వారు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల్లోపే ఇంటికి వెళ్లిపోతున్నారని తెలిపారు. దీంతో తాము వివిధ రకాల తినుబండారాలకు ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అంతేకాకుండా అక్కడ పని చేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది రూ.100, రూ.50లు చెల్లించిన వారికి మాత్రమే బయటి ఫుడ్‌ను అనుమతిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని వారు కోరారు.

ఆరుగురు గంజాయి విక్రేతల అరెస్ట్

రాయచోటి టౌన్ : రాయచోటిలో గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని అర్బన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్ సోమవారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాయచోటి పట్టణంలోని నాయిబ్ సాహెబ్ వీధికి చెందిన షేక్ జమాల్ బాషా గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో నిఘా పెట్టామన్నారు. జమాల్ బాషాను అదుపులోకి తీసుకొని అతని నుంచి 1200 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. అతని సమాచారంతో బండ్లపెంట వద్ద దివానాసాబ్ దర్గా దగ్గర తిరుగుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరిలో అదే వీధికి చెందిన షేక్ మహబూబ్ జాన్, షేక్ అమ్మాజీ, షేక్ ఫక్రున్నిసాతోపాటు అనంతపురానికి చెందిన రహమత్‌జాన్, షేక్ సోను ఉన్నారని తెలిపారు. వీరిలో మహబూబ్ జాన్, రహమ్మత్ జాన్‌లు కాకినాడ, సామర్లకోట నుంచి కిలో రూ.1300తో తీసుకొచ్చి ఇక్కడ రూ.1500తో అమ్ముతుంటారని పేర్కొన్నారు. చిన్న ప్యాక్‌లుగా తయారు చేసి, పట్టణంలోనే కాకుండా ఇతర ప్రాంతాల వారికి అమ్ముతుంటారన్నారు. వీరిని పట్టుకోవడానికి అర్బన్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐలు నరసింహారెడ్డి, అబ్దుల్ జహీర్, సిబ్బంది రామచంద్ర, బర్కతుల్లా, మహేంద్రనాయుడు, పెంచలయ్య, మహేంద్ర, అనాలసిస్ ఇన్‌చార్జి రవి, ఇతర సిబ్బంది చాకచక్యంగా పని చేశారని పేర్కొన్నారు. వీరిని అభినందిస్తున్నట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కృష్ణమోహన్

సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

రాయచోటి అర్బన్ : కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు వెంటనే అమలు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పండుగోలు మణి, తోపు క్రిష్టప్ప డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ హామీలతోపాటు ఇతర హామీలను కూడా తక్షణమే అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా.. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి అధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లికి వందనం పథకం అమలు చేయకపోవడంతో ఫీజుల చెల్లింపు భారమై వ్యవసాయ కార్మికుల పిల్లలు చదువు మానేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే విద్యార్థులకు తల్లికి వందనం పథకం ఫలాలు చేరేలా చూడాలన్నారు. సాంకేతిక కారణాలు పక్కన పెట్టిన అర్హులందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్లను వెంటనే ఇవ్వాలని, ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగావకాశాలు కల్పించాలని, నిరుద్యోగులకు రూ.3 వేల నిరుద్యోగభృతిని అందివ్వాలన్నారు. ఎన్‌టీఆర్ రైతు భరోసా కింద రైతాంగానికి రూ.20 వేలు చెల్లించాలన్నారు. మహిళలకు తక్షణమే చేయూత పథకాన్ని అమలు చేయాలంటూ కోరారు. ఎస్‌హెచ్‌జీలకు వడ్డీలేని రుణాలను రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్‌లను పునరుజ్జీవింప చేయాలని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ల నిధులను కేవలం దళిత, గిరిజనుల అభివృద్ధికే వినియోగించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నేతలు జయరామయ్య, వెంకటరమణ, వెలుగు క్రిష్ణవేణి, కళావతి, లక్షుమయ్య, రమణయ్య, రాజేశ్వరి, శివ, సీపీఐ నేతలు ఎస్.శ్రీనివాసులు, సుమిత్రమ్మ, టీఎల్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.




ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు

మాకు న్యాయం చేయండి

లక్ష్మీదేవి మృతిపై విచారణ చేయండి

రాయచోటి అర్బన్ : పీలేరు పట్టణంలోని ఎస్‌కేఆర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన లక్ష్మీదేవి మృతిపై విచారణ జరిపించి తగు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను మృతురాలి కుటుంబీకులు కోరారు. సోమవారం లక్ష్మీదేవి కుటుంబీకులు సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు టీఎల్ వెంకటేష్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నేత వెంకటేష్ మాట్లాడుతూ కె.వి.పల్లె మండలం గోరంట్లపల్లె గ్రామం కురవపల్లెకు చెందిన లక్ష్మీదేవిని ఆమె కుటుంబీకులు వైద్యం కోసం పీలేరులోని ఎస్‌కేర్ ఆసుపత్రిలో చేర్పించారన్నారు. అక్కడి డాక్టర్‌లు నిర్లక్ష్యం ప్రదర్శించి తూతూమంత్రంగా వైద్యం చేశారన్నారు. లక్ష్మీదేవి పరిస్థితి విషమం కావడంతో మదనపల్లెలోని మరో ఆసుపత్రికి తరలించారని, అక్కడ కూడా సరైన వైద్యం అందివ్వలేదన్నారు. చివరకు లక్ష్మీదేవి మృతిచెందడంతో ఆగ్రహించిన ఆమె కుటుంబీకులు పీలేరు ఎస్‌కేఆర్ ఆసుపత్రి వద్దకు వచ్చి ప్రశ్నిస్తే వారిపై ఆసుపత్రి యాజమాన్యం దౌర్జన్యం చేయడం జరిగిందన్నారు. ఈ విషయమై విచారించేందుకు వచ్చిన అధికారులు సరైన విచారణ జరుపలేదంటూ ఆరోపించారు. వెంటనే తమరు జోక్యం చేసుకుని లక్ష్మీదేవి మృతిపై విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌కు విన్నవించారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ సంఘటనపై విచారణ జరిపించి న్యాయం చేస్తామంటూ బాధిత కుటుంబీకులతో అన్నారు. కార్యక్రమంలో మృతురాలు లక్ష్మీదేవి కుమారుడు నాగేశ్వర, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు విన్నవిస్తున్న లక్ష్మీదేవి కుటుంబ సభ్యులు


జయంతి ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగ్‌ను పునరుద్ధరించాలి

జీఎంకు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి లేఖ

రాజంపేట : అయ్యప్పల బండిగా ప్రసిద్ధికెక్కిన జయంతి(16381/16382) ఎక్స్‌ప్రెస్ రైలుకు రాజంపేటలో ఉన్న హాల్టింగ్‌ను పునరుద్ధరించాలని రాజంపేట లోక్‌సభ సభ్యుడు పీవీ మిథున్‌రెడ్డి దక్షిణ మధ్య రైల్వే జీఎం ఏకే జైన్‌కు సోమవారం లేఖ రాశారు. ఈ లేఖను తిరుపతిలో జరిగిన రైల్వే స్టాండింగ్ కమిటీ సమావేశంలో జీఎంకు గుంతకల్ రైల్వే డివిజనల్ యూజర్స్ కమిటీ మాజీ సభ్యుడు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి అందజేశారు. ఈ విషయంపై ఎంపీ మాట్లాడుతూ పార్లమెంటరీ, శాసనసభ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో జయంతి ఎక్స్‌ప్రెస్ రైలుకు ప్రయోగాత్మకంగా హాల్టింగ్ సౌకర్యం గతంలో కల్పించారని, ఇప్పుడు హాల్టింగ్ ఎత్తివేయడం సరైన నిర్ణయం కాదన్నారు. ఈ ప్రాంతం నుంచి అయ్యప్ప భక్తులు శబరిమలైకు వెళ్లేందుకు జయంతి ఎక్స్‌ప్రెస్ రైలు అనుకూలంగా ఉందన్నారు. ఈ రైలు ప్రవేశపెట్టినప్పటి నుంచి రాజంపేటలో హాల్టింగ్ ఉందన్నారు. కోవిడ్ తొలిసారిగా వచ్చిన క్రమంలో ఈ రైలును రద్దు చేశారన్నారు. మళ్లీ ప్రవేశపెట్టిన క్రమంలో కొన్ని రోజులు పాటు స్టాపింగ్ కొనసాగించి, మళ్లీ అయ్యప్పల సీజన్ ప్రారంభంలోనే తీసివేయడం శోచనీయమన్నారు. రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు, కార్మికుల రాకపోకలకు ఈ రైలు అనుకూలమన్నారు.

కోవిడ్‌కు ముందు హాల్టింగ్స్‌ను..

జిల్లా మీదుగా నడిచే రైళ్ల హాల్టింగ్స్ విషయంలో స్టాండింగ్ కమిటీ ప్రయాణికులను దృష్టిలో ఉంచుకొని సముచిత నిర్ణయం తీసుకోవాలని కోరామని డీఆర్‌యూసీసీ మాజీ సభ్యుడు తల్లెం భరత్‌రెడ్డి తెలిపారు. నందలూరు, రాజంపేట, ఓబులవారిపల్లె, రైల్వే కోడూరు మీదుగా వెళ్లే పలు రైళ్లకు సంబంధించి కోవిడ్‌కు ముందు హాల్టింగ్స్‌ను పునరుద్ధరించాలని కోరామన్నారు. కార్తీకమాసం నుంచి సంక్రాంతి వరకు అయ్యప్పదీక్షలు చేపట్టిన భక్తులు శబరిమలైకి వెళ్లేందుకు జయంతి రైలు అనుకూలమన్నారు. ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ఆదేశం మేరకు జీఎంను కలిసి విన్నవించామన్నారు. అలాగే కృష్ణపట్నం రైలు మార్గంలో కొత్త రైలును ప్రవేశ పెట్టాలని కోరామన్నారు.



ఎంపీ మిథున్‌రెడ్డి లేఖను చదువుతున్న దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజరు ఏకే జైన్

హౌసింగ్ పీడీపై విచారణ చేయాలి

రాయచోటి అర్బన్ : జిల్లా గృహనిర్మాణ సంస్థ పీడీ వల్లెపు సాంబశివ అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా నేత మావులూరి విశ్వనాథ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నేతలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో హౌసింగ్ పీడీ అనేక అక్రమాలకు పాల్పడ్డారన్నారు. కింది స్థాయి సిబ్బంది ఫోన్‌పేల ద్వారా అక్రమ ఆర్జనను తన కుటుంబీకుల అకౌంట్లకు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారని ఆరోపించారు. రెండేళ్లుగా సొంత కారును వినియోగించుకుంటూ అద్దె కారును ఉపయోగించుకుంటున్నట్లుగా చూపిస్తున్నారని పేర్కొన్నారు. కార్యాలయ నిర్వహణ కోసం ప్రభుత్వం నుంచి వచ్చే సొమ్మును సైతం నకిలీ ఓచర్లు పెట్టి సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపించారు. పీడీ బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అయితే నకిలీ ఎస్టీ సర్టిఫికెట్‌తో ప్రభుత్వ ఉద్యోగం పొందారన్నారు. అనంతరం వారు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లిబరేషన్ పార్టీ నేతలు రమణ, ఆంజనేయులు, సుజాత, మాణిక్యం, సుబ్బమ్మ, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నేతలు

యాప్‌లో ఎస్‌హెచ్‌జీల సమాచారం పొందుపరచాలి

రాయచోటి అర్బన్ : స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)కి చెందిన సమగ్ర సమాచారాన్ని ఎస్‌హెచ్‌జీ ప్రొఫైల్ యాప్‌లో పొందుపరచాలని మెప్మా పీడీ సురేష్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో జిల్లా పరిధిలోని రాజంపేట, రాయచోటి, మదనపల్లె పురపాలక సంఘాలలో పని చేస్తున్న మెప్మా రిసోర్స్ పర్సన్‌లు, సిబ్బందిలకు ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్ నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా మెప్మాలో ఉన్న మహిళా సంఘాలకు సంబంధించిన సమగ్ర సమాచారం ఆన్‌లైన్‌లో లేదన్నారు. దీంతో మిషన్ డైరెక్టర్, మెప్మా, గుంటూరు వారి ఆదేశాల మేరకు ఎస్‌హెచ్‌జీ ప్రొఫైల్ యాప్‌లో వాస్తవిక సమాచారాన్ని పొందుపరచేందుకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పొదుపు సంఘాల సభ్యులు అప్పులు, పొదుపులు, సాంఘిక, ఆర్థిక, వాస్తవిక సమాచారాన్ని యాప్‌లో పొందుపరచడం జరుగుతుందన్నారు. సంఘాల సభ్యులు పేదరికం నుంచి బయటపడేందుకు అవసరమైన ఆర్థిక ప్రణాళికల తయారీకి యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందంటూ చెప్పారు. ఎస్‌హెచ్‌జీ సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించుకునేందుకు అవకాశం కల్పించామన్నారు. కార్యక్రమంలో జిల్లా స్థాయిలో పని చేస్తున్న టీఈలు, సీఎంఎంఎస్‌లు, సీఓలు, డీఈవో, డీఆర్‌పీ, టీఎల్ఎఫ్ఆర్‌పీలు, ఎస్ఎల్ఎఫ్ ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెప్మా పీడీ సురేష్‌రెడ్డి

ఐదు కోడి పుంజుల దొంగల అరెస్ట్

ఒక్కో కోడి పుంజు ధర రూ.30 వేల పైనే

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని ఒక ఫాంహౌస్‌లో ఐదు పెద్ద జాతి కోడి పుంజులను దొంగతనం చేసిన ఇద్దరిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ అబ్దుల్ జహీర్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి పట్టణానికి చెందిన మహబూబ్ బాషా (శివాజీ బీడీ ఫ్యాక్టరీ యజమాని కుమారుడు) ఓదివీడు సమీపాన గల పిల్లిగుండ్ల వద్ద ఫాం హౌస్ ఏర్పాటు చేసుకున్నాడు. ఆయనకు కోళ్లను పెంచుకునే మోజు ఉండటంతో ఒక్కొక్క కోడి పుంజుకు రూ.30 వేలకు పైగా వెచ్చించి, ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చాడు. వాటి కోసం ప్రత్యేకంగా ఒక కుటీరాన్ని ఏర్పాటు చేశాడు. ఆ ప్రత్యేక షెడ్‌ను నరసింహులు, బాషా నిర్మించారు. వారే శనివారం రాత్రి గుట్టుచప్పుడు కాకుండా తోట (ఫాం హౌస్) పడమర భాగాన కంచెను తొలగించి.. అందులోని ఐదు కోడి పుంజులను ఎత్తుకెళ్లారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు రంగ ప్రవేశం చేశారు. నరసింహులు, బాషా ప్రవర్తనలో మార్పు కనిపించడంతో, పట్టుకొని విచారణ చేయగా, ఒప్పుకొన్నారు. వాటిని రాయచోటి పట్టణంలోనే ఒక్కొక్కటి రూ.1000లకు అమ్మేసినట్లు తెలిపారు. వచ్చిన డబ్బులతో మద్యం తాగేశారు. కొనుగోలు చేసిన వారి ఇంటి వద్దకు వెళ్లి విచారణ చేశారు. వారు అప్పటికే రెండు కోళ్లు ఆదివారం కోసుకొని తినేసినట్లు తెలిపారు. మిగిలిన మూడు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నారు.

ఉత్సాహంగా అండర్-14 క్రికెట్ టోర్నీ

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-14 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. సోమవారం కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో అనంతపురం, శ్రీకాకుళం జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచిన అనంత జట్టు 45.1 ఓవర్లలో 130 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని హేమచంద్రనాయక్ 29 పరుగులు చేశాడు. శ్రీకాకుళం బౌలర్ సిమ్మా సాత్విక్ 5 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 44 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. జట్టులోని నేత్రా కిరణ్ 77, వివేకానంద 62 పరుగులు చేశారు. దీంతో తొలిరోజు ఆట ముగిసే సమయానికి శ్రీకాకుళం జట్టు 26 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

రాజారెడ్డి స్టేడియంలో : వైఎస్ఆర్ఆర్-ఏసీఏ క్రికెట్ మైదానంలో నెల్లూరు, కృష్ణా జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నెల్లూరు జట్టు 90 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 246 పరుగులు చేసింది. జట్టులోని సుశాంత్ 67, సాయియశ్వంత్ 51 పరుగులు చేశారు. కృష్ణా బౌలర్ రిత్విక్ 2 వికెట్లు తీశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

కేఎస్ఆర్ఎం మైదానంలో : కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో విజయనగరం, గుంటూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన గుంటూరు జట్టు 89.3 ఓవర్లలో 313 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని కౌషిక్ 183 బంతుల్లో 151 పరుగులు చేశాడు. విజయనగరం బౌలర్ సాయిప్రణీత్ 3 వికెట్లు తీశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

15 నుంచి పెయింటింగ్ పోటీలు

కడప కార్పొరేషన్ : జిల్లాలోని ప్రాచీన చరిత్ర, పర్యాటక ప్రాంతాలు, వాటి సంస్కృతిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దక్షిణ భారత పర్యాటక సంస్థ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, కళాకృతి ఆర్ట్స్ గ్యాలరీ నిర్వాహకులు డాక్టర్ మాధవి సంయుక్త ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆలయాలు, కోటలను పరిరక్షించుకునేందుకు తమ సంస్థల ఆధ్వర్యంలో నెలకొక పర్యాటక ప్రాంతం చొప్పున ఓపెన్ స్పాట్ పెయింటింగ్ కాంపిటేషన్‌ను నవంబర్ 15వ తేదీ పుష్పగిరి నుంచి మొదలు పెడుతున్నామని వారు పేర్కొన్నారు. పెయింటింగ్స్ వేయదలుచుకున్న వారు (ఆర్టిస్టులు) సామగ్రిని తామే తెచ్చుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నంబర్లు: 9290131343, 8309710250ను సంప్రదించాలని కోరారు.

మదనపల్లెలో హీరో కిరణ్ అబ్బవరం సందడి

- 'క' సినిమా విజయోత్సవాల్లో భాగంగా రాక
- అభిమానుల అత్యుత్సాహంతో మాట్లాడకుండా వెళ్లిపోయిన వైనం

మదనపల్లె : తెలుగు సినిమా హీరో కిరణ్ అబ్బవరం సోమవారం రాత్రి మదనపల్లెలో సందడి చేశారు. అయితే అభిమానుల అత్యుత్సాహంతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు. కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన 'క' సినిమా దీపావళి పండుగ సందర్భంగా విడుదలై సూపర్‌టాక్ తెచ్చుకుంది. విజయోత్సవాల్లో భాగంగా కిరణ్ అబ్బవరం 'క' మూవీ టీంతో కలిసి సోమవారం రాత్రి 7 గంటలకు మదనపల్లెకు చేరుకున్నారు. ముందుగా స్థానిక ఆర్టీసీ బస్టాండులో హెల్పింగ్ మైండ్స్ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ఫుడ్‌బ్యాంకును సందర్శించారు. ఆపన్నుల ఆకలి తీర్చేందుకు ఫుడ్‌బ్యాంకులో ఆహార పొట్లాలను స్వయంగా ఉంచారు. అనంతరం అభిమానులతో కలిసి 'క' చిత్రం ప్రదర్శిస్తున్న రవి సినిమా థియేటర్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ పెద్ద ఎత్తున గుమికూడిన అభిమానులు ఈలలు, కేరింతలతో కోలాహల వాతావరణం సృష్టించారు. ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్‌తో దృశ్యాలను చిత్రీకరించేందుకు పోటీపడ్డారు. హీరోతోపాటు సినిమా హాలులో వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. సినిమా థియేటర్ లోపలికి వెళ్లేంత వరకు విపరీతమైన అభిమానుల తాకిడితో హీరో కిరణ్ అబ్బవరం సతమతమయ్యారు. థియేటర్ లోపల మాట్లాడేందుకు ప్రయత్నిస్తూ.. అభిమానులను కూర్చువాల్సిందిగా పదే పదే అభ్యర్థించారు. అయినా అభిమానుల గోల,హడావిడి తగ్గకపోవడంతో చేసేది లేక, అందరికీ రెండు చేతులు ఎత్తి నమస్కరిస్తూ మాట్లాడకుండానే తిరిగి వెళ్లిపోయారు. కిరణ్ అబ్బవరంను చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున రావడంతో థియేటర్ ప్రాంగణంలో పోలీసులు లాఠీఛార్జీ చేయాల్సి వచ్చింది. కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు, హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్ సిద్దిక్ పాల్గొన్నారు.



ఫుడ్‌బ్యాంకు వద్ద హీరో కిరణ్ అబ్బవరం